క్లుప్తంగా

రేకుల షెడ్డు ఏర్పాటుకు కృషి


కాలనీల వాసులతో కార్పొరేటర్‌ లచ్చిరెడ్డి

ఎల్‌బీనగర్‌: బీఎన్‌రెడ్డినగర్‌ డివిజన్‌ పరిధిలోని గాయత్రినగర్‌ బ్యాంక్‌ కాలనీలో ఉన్న పోచమ్మ, ఎల్లమ్మ దేవాయలయంపై ఉన్న రేకుల షెడ్డును అక్రమంగా నిర్మించారని ఇటీవల అధికారులు తొలగించారు. షెడ్డును తిరిగి నిర్మించేందుకు సహకరించాలని పలు కాలనీల సంక్షేమ సంఘం నాయకులు ఆదివారం కార్పొరేటర్‌ మొద్దు లచ్చిరెడ్డి కలిసి విన్నవించారు.ఈ సందర్భంగా కార్పొరేటర్‌ మాట్లాడుతూ.. షెడ్డు నిర్మాణానికి ఎలాంటి సమస్యల లేకుండా అధికారులతో మాట్లాడి నిర్మించేందుకు చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కాలనీవాసులు కృష్ణ, నందకిషోర్‌ పాల్గొన్నారు.

వయోవృద్ధులకు ఆటల పోటీలు


క్యారం బోర్డు ఆడుతున్న సీనియర్‌ సిటిజెన్స్‌

వనస్థలిపురం: స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను పురస్కరించుకుని హయత్‌నగర్‌ డివిజన్‌ పరిధిలోని శారదానగర్‌లో ఆదివారం సీనియర్‌ సిటిజెన్స్‌ ఫోరం, కాలనీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో వయోవృద్ధులకు ఆటల పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా క్యారంబోర్డు, చెస్‌ తదితర పోటీలను నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో జ్ఞానేశ్వర్‌, హరిప్రసాద్‌, ఆర్‌కే.ప్రసాద్‌, బీజీవీ.ప్రసాద్‌, రాజేంద్రప్రసాద్‌, డా.అప్పారావు, శ్రీనివాసరావు, కేఎల్‌ఎన్‌.రావు పాల్గొన్నారు.

దివ్యాంగుల కమిషనర్‌ పోస్ట్‌కు నోటిఫికేషన్‌ అభినందనీయం


పానుగోటి చొక్కారావు

చాదర్‌ఘాట్‌: తెలంగాణ ప్రభుత్వం దివ్యాంగులకు స్వయం ప్రతిపత్తి కలిగిన కమిషనర్‌ నియామకానికి నోటిఫికేషన్‌ విడుదల చేయటం అభినందనీయమని డ్వాబ్‌ ప్రధాన కార్యదర్శి పానుగోటి చొక్కారావు అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అఖిల భారత అంధుల సమాఖ్య సహకారంతో డెవలప్‌మెంట్‌ అండ్‌ వెల్ఫేర్‌ అసోషియేషన్‌ ఆఫ్‌ ది బ్లైండ్‌ తరుపున 2016 దివ్యాంగుల చట్టం ప్రకారం దివ్యాంగులకు స్వయం ప్రతిపత్తి కలిగిన కమిషనర్‌ను నియమించాలని హైకోర్టులో పోరాడామని తమ పోరాట ఫలితంగా ప్రభుత్వం దివ్యాంగుల కమిషనర్‌కు నోటిఫికేషన్‌ విడుదల చేసిందన్నారు. కమిషనర్‌ పోస్ట్‌కు అర్హులైన అంధులు, దివ్యాంగులు దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

దివ్యాంగుల కార్పొరేషన్‌లో ఖాళీలు భర్తీ చేయాలి

చాదర్‌ఘాట్‌: దివ్యాంగుల సంక్షేమ శాఖ కార్పొరేషన్‌లో ఉద్యోగాలను వెంటనే భర్తీ చేయాలని రాష్ట్ర వికలాంగుల నెట్‌వర్క్‌ అధ్యక్షుడు నల్లగొండ శ్రీనివాస్‌ అన్నారు. ఆదివారం మలక్‌పేటలోని జాతీయ వికలాంగుల పార్కులో ఆయన మాట్లాడుతూ.. వికలాంగుల సంక్షేమశాఖను స్వతంత్ర శాఖగా కొనసాగించాలని, 33 జిల్లాలో ఏడీ ఆఫీసులు తెరవాలన్నారు. ఓహెచ్‌, రోస్టర్‌ పాయింట్‌ 10 లోపు మార్చుటకు ప్రతిపాదనలు సిద్ధం చేసి ప్రభుత్వానికి నివేదిక పంపాలని కోరారు. డ్రైస్‌ కోడ్‌ ఉద్యోగాలలో దివ్యాంగులకు 4 శాతం రిజర్వేషన్లు కల్పించాలని కోరారు. ఈ విషయంలో కార్పొరేషన్‌ ఎండీ శైలజ, చైర్మన్‌ ముత్తినేని వీరయ్య చొరవ చూపి అమలుకు సహకరించాలని కోరారు.

రైతు బజార్‌లలో కూరగాయల ధరలు

దిల్‌సుఖ్‌నగర్‌: సరూర్‌నగర్‌/వనస్థలిపురం రైతు బజార్‌లలో కూరగాయల ధరల వివరాలు.. టమాటా రూ.41, వంకాయ రూ.23, బెండ రూ.50, పచ్చిమిర్చి రూ.55, కాకరకాయ రూ.35, బీరకాయ రూ.45, కాలిఫ్లవర్‌ రూ.18, క్యాబేజీ రూ.15, క్యారెట్‌ రూ.45, దొండ రూ.43, ఆలుగడ్డ రూ.23, ఉల్లిగడ్డ రూ.24, గోకరకాయ రూ.47, దోసకాయ రూ.15, సొరకాయ రూ.13, పొట్లకాయ రూ.18, అరటికాయ రూ.11, చిక్కుడుకాయ రూ.65, చామగడ్డ రూ.28, మునగ రూ.28, కందగడ్డ రూ.40, బీట్‌రూట్‌ రూ.21, కీర రూ.23, బీన్స్‌ రూ.85, క్యాప్సికమ్‌ రూ.45. ఈ ధరలు సోమవారం ఉదయం 9 గంటల వరకు వర్తిస్తాయి.

తవ్వడం సరే.. పూడ్చడం ఎప్పుడో?

అభివృద్ధి పేరిట బాగున్న రోడ్ల తవ్వకాలు | ఇబ్బందులు పడుతున్న కాలనీవాసులు | పట్టించుకోని అధికారులు


ఎస్‌బీహెచ్‌ కాలనీలో మరమ్మతుకు నోచుకోని బీటీ రోడ్డు


లక్ష్మీనగర్‌ కాలనీలో ఇటీవల వేసిన సీసీ రోడ్డు తవ్విన దృశ్యం

మలక్‌పేట: అభివృద్ధి పేరిట బాగున్న రోడ్లను తవ్వుతుండటంతో రూ.లక్షల్లో ప్రజాధనం వృథా అవుతోంది. పైపులైన్ల ఏర్పాటు కోసం కాలనీల్లోని అంతర్గత రోడ్లు తవ్వి సరిగా పూడ్చకుండా వదిలేస్తుండంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు తలెత్తుతున్నాయని వాహనదారులు వాపోతున్నారు. తాగునీరు, డ్రైనేజీ ఇతర పైపులైన్ల కోసం బీటీ, సీసీ రోడ్లను తవ్వి పూడ్చడం లేదు. దీంతో రోడ్లు గుంతలమయంగా మారాయి. కొన్నిసార్లు రోడ్లను తవ్వగా వచ్చిన మట్టి, వ్యర్థాలు అలాగే రోడ్లపై వదిలేస్తున్నారు. అస్తవ్యస్తంగా మారిన రోడ్లకు మరమ్మతులు చేపట్టకపోవడంతో తీవ్ర ఇబ్బందులు తలెత్తుతున్నాయి.

కాలనీల్లోనీ రోడ్ల దుస్థితి ..

కాలనీలోని రోడ్లను తవ్వి వదిలేస్తుండటంతో వర్షాలకు పూర్తిగా ధ్వంసమవుతున్నాయి. మూసారంబాగ్‌ డివిజన్‌ పరిధిలోని ఎస్‌బీహెచ్‌ కాలనీ, లక్ష్మినగర్‌ కాలనీ, శాలివాహననగర్‌, దిల్‌సుఖ్‌నగర్‌ తదితర ప్రాంతాల్లోని రోడ్లన్నీ గుంతలమయంగా మరాయి. విద్యా, వ్యాపార, వాణిజ్య సంస్థలు ఎక్కువగా ఉండటం రద్దీ ఎక్కువగా ఉంటుంది. పాడైపోయిన రోడ్ల మూలంగా వాహనదారులు పాదచారులకు ఇబ్బందులు పడుతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి ధ్వంసమైన రోడ్లకు మరమ్మతులు చేయాలని కోరుతున్నారు.

రోడ్లను ధ్వంసం చేస్తున్నారు..



ఇటీవల నిర్మించిన రోడ్లను ఇష్టానుసారంగా తవ్వడంతో ప్రజాధనం వృథా అవుతోంది. చెక్కు చెదరని రోడ్లు పైపులైన్‌ నిర్మాణ పనులతో పాడు చేస్తున్నారు. అధ్వానంగా ఉన్న రోడ్లను పట్టించుకోవడం లేదు. సంబంధిత కాంట్రాక్టర్లు పనులు అసంపూర్తిగా చేయడంతో సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి.

–ప్రశాంత్‌, మూసారంబాగ్‌

పార్టీలకు అతీతంగా అభివృద్ధి


సీసీ రోడ్డును ప్రారంభిస్తున్న రాజశేఖర్‌రెడ్డి

లింగోజిగూడ: డివిజన్‌లో పార్టీలకు అతీతంగా అభివృద్ధి కొనసాగుతోందని లింగోజిగూడ కార్పొరేటర్‌ దర్పల్లి రాజశేఖర్‌రెడ్డి అన్నారు. డివిజన్‌ పరిధిలోని న్యూ శివపురి కాలనీలో రూ.47 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డు, రూ.15 లక్షలతో చేపట్టనున్న 200 మీటర్ల డ్రైనేజీ పనులను ఆదివారం ఆయన కాలనీవాసులతో కలిసి ప్రారంభించారు.ఈ సందర్భంగా కార్పొరేటర్‌ మాట్లాడుతూ.. ఎన్నికల్లో ఇచ్చిన హామీల మేరకు డివిజన్‌లో కోట్ల రూపాయాలతో అభివృద్ధి పనులు చేపట్టడం జరిగిందన్నారు. ఇప్పటికే కాలనీలో సీసీ రోడ్డు, డ్రైనేజీ, ముంపునకు గురి కాకుండా నాలాలు, వీధి దీపాలు ఏర్పాటు చేశామన్నారు. త్వరలో చేపట్టనున్న సీఎం రోడ్డు వెడల్పుకు స్థానికులు సహకరించాలని కోరారు. డివిజన్‌ను చెత్త రహితంగా తీర్చి దిద్దాలంటే ప్రజల సహకారం అవసరమని, ప్రతి ఒక్కరు చెత్తను రోడ్లు, ఖాళీ ప్రదేశాల్లో వేయరాదన్నారు. ఈ కార్యక్రమంలో రాజేష్‌గౌడ్‌, సురేష్‌, రాజు, మధుసూదన్‌ చారి, విష్ణువర్దన్‌, శ్రీధర్‌గౌడ్‌, ప్రవీణ్‌రెడ్డి, కరుణ్‌కుమార్‌, శ్రీకాంత్‌, గోవర్దన్‌, అమీర్‌, వెంకట్‌ పాల్గొన్నారు.

పేద విద్యార్థులకు అండగా ఉంటాం


విద్యార్థులకు చెక్కులు అందజేసిన ట్రస్ట్‌ సభ్యులు

దిల్‌సుఖ్‌నగర్‌: ఆర్థికంగా వెనుకబడిన ఆర్యవైశ్య పేద విద్యార్థులకు శ్రీ వాసవి విద్యా ట్రస్ట్‌ అండగా ఉంటుందని ఫౌండర్‌ దుబ్బ అనిల్‌కుమార్‌ తెలిపారు. ఆర్‌కేపురం డివిజన్‌ హరిపురి కాలనీ సంక్షేమ సంఘం కమ్యూనిటీ భవనంలో ట్రస్ట్‌ ఆధ్వర్యంలో ఉత్తమ ప్రతిభా కనబరిచిన 37 మంది పేద విద్యార్థులకు రూ.8,44,204 చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా అనిల్‌కుమార్‌ మాట్లాడుతూ.. ట్రస్ట్‌ గత మూడు సంవత్సరాలుగా ఆర్థికంగా వెకుకబడ్డ ఆర్య వైశ్య విద్యార్థుల చదువు కోసం సహాయం అందిస్తోందని తెలిపారు. ఈ ఏడాది కూడా విద్యార్థులకు చెక్కుల పంపిణీ చేసినట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో ట్రస్ట్‌ చైర్మన్‌ మురళీధర్‌, అధ్యక్షులు తాడేపల్లి వెంకటేశం, తదితరులు పాల్గొన్నారు.

పరుగు.. ఆరోగ్యానికి మెరుగు


రన్‌ను జెండా ఊపి ప్రారంభిస్తున్న ఉప్పల శ్రీనివాస్‌గుప్తా

నాగోలు: పరుగు ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుందని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి ఉప్పల శ్రీనివాస్‌ గుప్తా అన్నారు. బండ్లగూడ డీఆర్‌ఎఫ్‌ ట్రైనింగ్‌ సెంటర్‌లో కేఎస్‌ఆర్‌ సైక్లింగ్‌ నాగరాజు ఆధ్వర్యంలో ఇందు ఇంటర్నేషనల్‌ స్కూల్‌ సంయుక్తంగా నిర్వహించిన తెలంగాణ హిస్టారికల్స్‌ 10కే రన్‌, రైడ్‌ 3వ ఎడిషన్‌ను ఆదివారం ఆయన జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఉప్పల శ్రీనివాస్‌గుప్తా మాట్లాడుతూ.. పరుగెత్తడంతో గుండె కండరాలు బలంగా తయారువుతాయని, ఇది గుండె జబ్బులు, అధిక రక్తపోటు వంటి సమస్యల ప్రమాదాన్ని తగ్గిస్తుందని తెలిపారు. 10కే రన్‌లో పాల్గొన్న వారికి సర్టిఫికెట్లు అందజేశారు.

త్వరలో హయత్‌నగర్‌–కొహెడ రోడ్డు విస్తరణ

ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి


పాత రోడ్డును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి

హయత్‌నగర్‌: హయత్‌నగర్‌ నుంచి తొర్రూర్‌ మీదుగా కొహెడ ఔటర్‌ రింగ్‌ రోడ్డు వరకు ఉన్న రోడ్డు విస్తరణ పనులు త్వరలో ప్రారంభం అమవుతాయని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి తెలిపారు. ఆదివారం రాష్ట్ర రోడ్డు అభివృద్ధి కార్పొరేషన్‌ చైర్మన్‌ మల్‌రెడ్డి రాంరెడ్డితో కలిసి ఆయన హయత్‌నగర్‌లోని తొర్రూర్‌ క్రాస్‌రోడ్డు వద్ద రోడ్డును ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఈ రోడ్డు మార్గంలో నివాసాలు పెరగడంతో వాహనాల రద్దీ ఎక్కువైందని, తరుచూ ట్రాఫిక్‌ సమస్యతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. జాతీయ రహదారి నుంచి కొహెడ ఔటర్‌ రింగ్‌ రోడ్డు వరకు సుమారు పది కిలోమీటర్ల మేరకు రోడ్డును విస్తరించి నాలుగు లేన్ల రోడ్డు, సెంట్రల్‌ లైటింగ్‌ సిస్టం, అధునాతన జంక్షన్లు నిర్మించేందుకు ప్రతిపాదనలు సిద్ధమయ్యాయన్నారు. మొదటి విడతగా రూ. 10 కోట్లు మంజూరైనట్లు ఆయన తెలిపారు. పూర్తి స్థాయి ప్రాజెక్ట్‌ పనులకు మరో రూ.60 కోట్లు కేటాయిస్తామని ఎమ్మెల్యే వివరించారు. రోడ్డు విస్తరణ కోసం తొర్రూర్‌ క్రాస్‌రోడ్డు వద్ద సాయిబాబా దేవాలయానికి సెట్‌బ్యాక్‌ అవసరం ఉండడంతో వారితో మాట్లాడినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జాతీయ రహదారి ఎస్‌ఈ ధర్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం


సమ్మేళనానికి హాజరైన నాటి ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు

మలక్‌పేట: మూసారంబాగ్‌ స్వామి వివేకానంద సెంటనరీ హైస్కూల్‌1999–2000 పదవ తరగతి సీ–సెక్షన్‌ విద్యార్థులు ఆదివారం స్థానిక పాఠశాలలో పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా నాటి జ్ఞాపకాలను గుర్తుచేసుకుని తమ గురువులను సత్కరించి ఆశీస్సులు తీసుకున్నారు.

రేషన్‌ కార్డుల పంపిణీకి తేదీ ఖరారు కాలేదు

మలక్‌పేట సర్కిల్‌ ఏఎస్‌ఓ నర్సింగ్‌రాజు

చాదర్‌ఘాట్‌: మలక్‌పేట, యాకత్‌పురా నియోజకవర్గాల్లో రేషన్‌ కార్డుల పంపిణీకి తేదీ ఇంకా ఖరారు కాలేదని మలక్‌పేట సర్కిల్‌–1 పౌర సరఫరాల శాఖ అధికారి ఏఎస్‌ఓ నర్సింగ్‌రాజు తెలిపారు. రెండు నియోజకవర్గాల్లో 23000 దరఖాస్తులు రాగా మలక్‌పేట నియోజకవర్గంలో 3889 అప్రోల్‌ అయ్యాయని, అదే విధంగా యాకత్‌పురా నియోజకవర్గంలో 3806 దరఖాస్తులు అప్రోల్‌ అయ్యాయని తెలిపారు. రేషన్‌ కార్డుల జారీ గురించి ఎవరు కార్యాలయానికి రావొద్దని తేదీని మీడియా ద్వారా తెలియజేస్తామన్నారు. అర్హులందరికి కార్డులు వస్తాయని దళారులను ఆశ్రయించవద్దని సూచించారు.

సీపీఐ బలోపేతానికి కృషిచేస్తా


నర్సింహా

దిల్‌సుఖ్‌నగర్‌: భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) రంగారెడ్డి జిల్లా కార్యవర్గ సభ్యుడిని మహేశ్వరం నియోజకవర్గం ఆర్‌కేపురం డివిజన్‌ ఎన్టీఆర్‌నగర్‌కు బాతరాజు నర్సింహా ఎన్నికయ్యారు. సీపీఐ పార్టీ రంగారెడ్డి జిల్లా మహాసభలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, జాతీయ నాయకులు పల్లా వెంకట్‌రెడ్డి మూడవసారి రంగారెడ్డి జిల్లా కార్యదర్శిగా పాలమకు జంగయ్య ఏకగ్రీవంగా ఎన్నిక కాగా 23 మంది కార్యవర్గంతో రంగారెడ్డి జిల్లా కార్యవర్గం ఏర్పడిందని నర్సింహా తెలిపారు. ఈ సందర్భంగా నర్సింహా మాట్లాడుతూ.. పార్టీ బలోపేతానికి నిరంతరం కృషి చేస్తానన్నారు.

వినతి

బడంగ్‌పేట్‌: కార్పొరేషన్‌లోని 28వ డివిజన్‌లోని శ్రీమారుతీనగర్‌ కాలనీవాసులు ఆదివారం క్యాంప్‌ ఆఫీస్‌లో మాజీ కార్పొరేటర్‌ సూర్లగంటి అర్జున్‌ ఆధ్వర్యంలో మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితారెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేను ఘనంగా సత్కరించారు. అనంతరం కాలనీ అధ్యక్షుడు మెరుగు వేణు మాట్లాడుతూ.. శ్రీమారుతీనగర్‌లో సమస్యలు తిష్ట వేశాయని డ్రైనేజీ, సీసీరోడ్లు, వీధిదీపాలు, కృష్ణావాటర్‌ లేక ఇబ్బందులు పడుతున్నామన్నారు. మౌలిక సదుపాయాలు కల్పించాలని విన్నవించారు.

లయన్స్‌ క్లబ్‌ల సహకారంతో సేవా కార్యక్రమాలు


జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న గంప నాగేశ్వర్‌రావు

వనస్థలిపురం: లయన్స్‌ క్లబ్‌ వనస్థలిపురం రెండవ వార్షిక ఇన్‌స్టాలేషన్‌ కార్యక్రమ ఆదివారం వనస్థలిపురంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన 320హెచ్‌ డిస్ట్రిక్ట్‌ గవర్నర్‌ డా. గంప నాగేశ్వర్‌రావు మాట్లాడుతూ.. లయన్స్‌ క్లబ్‌ల ఆధ్వర్యంలో ఎన్నో సేవా కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతోందని అన్నారు. ఈ సందర్భంగా లయన్స్‌ క్లబ్‌ వనస్థలిపురం అధ్యక్షుడిగా ఎస్‌జేఎస్‌.నందకిశోర్‌, కార్యదర్శిగా రవిందర్‌రెడ్డి, కోశాధికారిగా నరసింహులు ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా క్లబ్‌ నందకిశోర్‌ మాట్లాడుతూ.. క్లబ్‌ ఆధ్వర్యంలో పలు సేవా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జెడ్సీ దూరయ్య, రమేష్‌, జగన్మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

‘అవినీతిపై ప్రశ్నిస్తే ట్రాన్స్‌ఫర్‌ చేస్తున్నారు’

వీఆర్‌ఎస్‌ ఇప్పించాలంటూ ఫిర్యాదు

ఎల్‌బీనగర్‌: జీహెచ్‌ఎంసీ సరూర్‌నగర్‌ సర్కిల్‌లో–5 బిల్‌ కలెక్టర్‌గా పని చేస్తున్న వీ.శ్రీశైలం తనను పైఅధికారులు వేధింపులకు గురి చేస్తున్నారని తనకు వీఆర్‌ఎస్‌ ఇప్పించాలని జీహెచ్‌ఎంసీ ప్రధాన కార్యాలయంలో ఫిర్యాదు చేశారు.సరూర్‌నగర్‌ సర్కిల్‌ కమర్షియల్‌ భవనాలు ఎక్కువగా ఉన్నాయని వాటికి పన్ను వేసే విషయంలో అవినీతి పాల్పడుతున్న డీసీ సుజాత, ఏఎంసీ శ్రీనివాసులు, ట్యాక్స్‌ ఇన్‌స్పెక్టర్‌ ఆనంద్‌లు ప్రశ్నించినందుకు గత రెండు సంవత్సరాల్లో నాలుగు ప్రాంతాలకు మార్చారని ఆరోపించాడు. ఎవ్వరికైన నోటీసులు ఇవ్వాలని చూస్తే వెంటనే అడ్డుకుంటున్నారని, లైసెన్స్‌, నోటీసు బుక్‌ కూడా ఇవ్వకుండా వేధిస్తున్నారని వాపోయాడు. ఈ విషయమై డిప్యూటీ కమిషనర్‌ను వివరణ కోరగా... ఆయన కారణంగా ప్రతిరోజూ వివాదాలు తమ కార్యాలయానికి వస్తున్నాయని ట్రేడర్స్‌, విద్యాసంస్థల యజమానులను పరుష పదజాలంతో దూషిస్తున్నారని పేర్కొన్నారు. గతంలో వేరే చోట పని చేసినప్పుడు కూడా అతని పనితీరు సరిగ్గా లేదని, ఇక్కడ సైతం అలాగే ప్రవర్తిస్తున్నందుకు మార్చాల్సి వచ్చింది తప్ప మరే ఇతర కారణాలు లేవని వివరించారు.



పాతికేళ్ల స్నేహగీతం

సాక్షి, సిటీబ్యూరో: దాదాపు 25 సంవత్సరాల క్రితం సెల్‌ఫోన్లు, ఇంటర్నెట్‌ లేనికాలంలో..ఎక్కడెక్కడివారో కలం స్నేహం ద్వారా కలిశారు. ఇప్పటికీ తమ స్నేహ బంధాన్ని కొనసాగిస్తున్నారు. ×పెన్‌–ఫోన్‌ అసోసియేషన్‌¾ పేరిట ఓ సమూహంగా ఏర్పడిన ఈ స్నేహ బృందం ఆదివారం స్నేహితుల దినోత్సవం సందర్భంగా కలుసుకున్నారు. పాతికేళ్ల తమ అనుబంధాన్ని నెమరేసుకున్నారు. ఉమ్మడి ఏపీలోని వివిధ జిల్లాలకు చెందిన వీరంతా ఉప్పల్‌ శిల్పారామంలో కలుసుకుని సరదాగా గడిపారు. శరత్‌, నాగరాజు, ఫుల్లారెడ్డి, మల్లికార్జున, అంజి, అస్లాం, నాగవీరేంద్ర, రవిపాల్‌ రెడ్డి, టీవీ ఆర్టిస్ట్‌ మురళీకృష్ణ, దొరైస్వామి, రాజయ్యగౌడ్‌, జిలానీ, కిషోర్‌ తదితరులు ఇందులో పాల్గొన్నారు.


ప్రసన్న మహంకాళి దేవాలయంలో పూజలో పాల్గొన్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి


బోనాల వేడుకల్లో పాల్గొన్న ఎంపీ ఆర్‌. కృష్ణయ్య


కొత్తపేటలో నిర్వహించిన బోనాల వేడుకల్లో పాల్గొన్న కార్పొరేటర్‌ నాయికోటి పవన్‌కుమార్‌

శ్రావణమాసం.. బోనాల వైభవం

శ్రావణమాసం సందర్భంగా ఆదివారం ఎల్‌బీనగర్‌ జోన్‌ పరిధిలో వివిధ ప్రాంతాల్లో బోనాలు వేడుకలు ఘనంగా నిర్వహించారు. కొత్తపేట, మోహన్‌నగర్‌, సత్యనగర్‌, బండ్లగూడ, ఫతుల్లాగూడ పరిసర ప్రాంతాల్లో బోనాలు ఉత్సవాలు జరిగాయి. ఈ సందర్భంగా వివిధ దేవాలయాల్లో వద్ద నిర్వహించిన పూజాది కార్యక్రమాల్లో ప్రజాప్రతినిధులు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు.

–నాగోలు


బండ్లగూడలోని తెలంగాణ హౌసింగ్‌ బోర్డు కాలనీలో బోనాలతో వస్తున్న మహిళలు

ఇందిరమ్మ ఇళ్లు కేటాయించాలి

మలక్‌పేట: సలీంనగర్‌ తీగలగూడ బంజరా గుడిసెవాసులకు ఇందిరమ్మ ఇళ్లు కేటాయించాలని తెలంగాణ దళిత గిరిజన సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బట్టు దాసురావు, ప్రధాన కార్యదర్శి కొర్ర చందులాల్‌ నాయక్‌ ఆదివారం మలక్‌పేట ఎమ్మెల్యే అహ్మద్‌ బలాలను కలిసి కోరారు. మూడు దశాబ్దాలుగా గుడిసెల్లో నివాసం ఉంటున్న ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ పేదలకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరయ్యేలా చర్యలు తీసుకుంటానని ఎమ్మెల్యే హామీ ఇచ్చినట్లు వారు తెలిపారు.


ఎమ్మెల్యే బలాలకు వినతిపత్రం ఇస్తున్న నాయకులు